మీ సమస్యను
మీడియాకు చెప్పాలని ఉందా?
M.V.S.G.TILAK M.Sc., B.Ed.
Uttarandra Regional Bureau Chief
MANAM daily paper AP & TG
journalist.tilak03@gmail.com
Whatsapp : 9494524365
Please send ur news items,
we will publish it on our platform.
manamepaper.com
సంప్రదించండి

మనం
జనం కోసం అక్షర యజ్ఞం...
ఉమ్మడి
ఉత్తరాంధ్ర జిల్లాలు
ఆదివారం | 09 | ఆగస్టు | 2026 | పేజీలు : 10

# గిరిజన ప్రాంత ప్రజల వైద్య సేవల్లో నూతన శకం




**- కురుపాంలో రూ.3 కోట్లతో 50 పడకల సీహెచ్‌సీ ప్రారంభం**
**- ఆసుపత్రిలో ఆహ్లాదకర వాతావరణం ఉండాలి**
**- రోగులకు మెరుగైన వైద్య సేవలతో పాటు సమయపాలన పాటించాలి**
**- మన్యం జిల్లా ఇన్చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**కురుపాం , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** మూరుమూల గిరిజన ప్రాంతమైన కురుపాంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన 50 పడకల నూతన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) భవనాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ, జిల్లా ఇంఛార్జ్ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా హాజరై శనివారం ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు నూతన ఆసుపత్రి భవనాన్ని, అందుబాటులోకి వచ్చిన వైద్య సదుపాయాలను

## అరకులో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

**- కలెక్టర్ టి. నిశాంతి మార్గదర్శకత్వంలో విస్తృత ఏర్పాట్లు**
**- ఆగస్టు 10న ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వేడుకలు**



**అరకు లోయ , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 10వ తేదీన ఉదయం 10 గంటలకు అరకులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అల్లూరి సీతారామ రాజు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా కలెక్టర్ టి. నిశాంతి, ఐఏఎస్ మార్గ దర్శకత్వం లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ప్రతి ష్టాత్మ కంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమ న్వయంతో ముందుకు సాగుతోంది. పీవో/ఐటీడి ఏ శ్రీ ఆదిత్య వర్మ, ఐఏఎస్ పర్యవేక్షణలో వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లను వేగవంతం చేశారు. ముఖ్య అతిథిగా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యా రాణి ఈ వేడుకలకు గౌరవనీయులైన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారం భించనున్నారు. ఈ సంద ర్భంగా ప్రజా ప్రతినిధులు, స్వాతంత్ర్య




## శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారిని దర్శించుకున్న ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ దంపతులు

**సింహాచలం , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** ఆంధ్ర యూనివర్సిటీ విశాఖ పట్నం గౌరవనీయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్ దంపతులు శనివారం సింహాచల పుణ్యక్షేత్రంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారిని సందర్శిం చారు. వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీ జల్లేపల్లి వెంకట్రావు వారికి ఆలయ రాజగోపురం వద్ద స్వాగతం పలికారు. నాదస్వర వాయిద్యాలు మరియు వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ వైస్ ఛాన్సలర్ దంపతులు కు ఆలయ మర్యాదలతో స్వాగతం లభించింది. దర్శనానికి ముందు, భక్తుల నమ్మకం ప్రకారం అత్యంత



చంద్రంపాలెం

## హైస్కూల్ కు పూర్వ వైభవం : గంటా

### ఈ నెల 21న అభివృద్ధి పనులు ప్రారంభించనున్న లోకేష్

**భీమునిపట్నం , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** చంద్రంపాలెం హైస్కూల్ కు పూర్వ వైభవానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, ఆర్జేడీ విజయ్ భాస్కర్, డిప్యూటీ డీఈఓ సోమశేఖర్ లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ రాహిత్యాన్ని ఉపేక్షించేది లేదని.. హైస్కూల్ ప్రగతి, విద్యార్థుల భవిష్యత్ ముఖ్యమని పేర్కొన్నారు.

ప్రస్తుత హెడ్ మాస్టర్ వెంకట్రావు స్థానంలో జిల్లాలో ఉత్తమ హెడ్ మాస్టర్లలో ఒకరిని చంద్రంపాలెం హైస్కూల్ లో నియమించాలని నిర్ణయించారు. ఇదే సమయంలో టీచర్లు కూడా క్రమశిక్షణగా ఉండాలన్నారు. హైస్కూల్ లో రూ. 6.5 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈనెల 21 న ప్రారంభిస్తారని వెల్లడించారు. రాష్ట్రానికే ఆదర్శంగా చంద్రంపాలెం హైస్కూల్ ను తీర్చి దిద్దుతామన్నారు.

# గిరిజన ప్రాంత ప్రజల వైద్య సేవల్లో నూతన శకం

ఒకటి తరువాయి

పరిశీలించారు. వైద్యులు, వైద్య సిబ్బంది, అధికారులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. కేవలం ఒక వైద్యుడు, ఒక స్టాఫ్ నర్సుతో అప్‌గ్రేడెడ్ పబ్లిక్ హెల్త్ సెంటర్‌గా ప్రారంభమైన కురుపాం ఆసుపత్రి నేడు రూ.3 కోట్ల వ్యయంతో 50 పడకల ఆధునిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అభివృద్ధి చెందడం గిరిజన ప్రాంత ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాల నుంచి వైద్యం కోసం వచ్చే గిరిజనులు, పేదలు, గర్భిణులు, అత్యవసర బాధితులకు వైద్యులు, సిబ్బంది కుటుంబ సభ్యుల్లా భావించి గౌరవప్రదంగా, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని మంత్రి సూచించారు. రోగులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు.ఆసుపత్రికి వచ్చే రోగులకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని, ఆసుపత్రి ప్రాంగణం ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌కు మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. గిరిజన ప్రాంత ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ కావాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి, ట్రైకార్ బోర్డు మెంబర్ పువ్వల లావణ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. పి. విజయలక్ష్మీ, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డా. జి. నాగభూషణరావు, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డా. టి. జగన్మోహనరావు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఇంజనీరింగ్ విభాగ సిబ్బంది, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అరకులో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

ఒకటి తరువాయి

సమర యోధులు మరియు వారి వారసులు, ప్రముఖులు, ఆదివాసీ నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలు, ఆదివాసీ గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు.

**ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట**

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, ఆచార వ్యవహారాలు, జీవన విధానం మరియు ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతిబింబించేలా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు వేదిక ఏర్పాట్లు, తాగునీరు, విద్యుత్, పార్కింగ్, భద్రత, ప్రజల సౌకర్యాలు తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

**మీడియా సహకారం కోరిన జిల్లా యంత్రాంగం**

ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలకు ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హాజరై, కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా యంత్రాంగం కోరింది. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రతిభ, అభివృద్ధి మరియు సంక్షేమాన్ని ప్రపంచానికి చాటిచెప్పే ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా యంత్రాంగం పిలుపునిచ్చింది.

## శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారిని దర్శించుకున్న ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ దంపతులు

ఒకటి తరువాయి

మహిమాన్వితమైన కప్పస్తంభాన్ని వైస్ ఛాన్సలర్ భక్తిశ్రద్ధలతో ఆలింగనం చేసుకున్నారు. అనంతరం గర్భాలయంలోని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారి విశిష్టతను వివరించారు. దర్శనం అనంతరం ఆలయ మండపంలో వేద పండితులు వైస్ ఛాన్సలర్ దంపతులు కు వేద ఆశీర్వచనం గావించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీ జె. వెంకట్రావు వైస్ ఛాన్సలర్ ని స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామి వారి ప్రసాదాలను జ్ఞాపికగా స్వామి వారి పటమును అందజేశారు.

# ధాబాలలో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు : అచ్యుతాపురం పోలీసులు

**అచ్యుతాపురం , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ ఆదేశాల మేరకు, శనివారం అచ్యుతాపురం మండల పరిధిలోని ధాబా యజమానులతో సర్కిల్ ఇన్స్పెక్టర్ (సిఐ) ఆర్.చంద్రశేఖర్ రావు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్సైలు సుధాకర్, పోషణ గౌరీలతో పాటు మండల పరిధిలోని 7 ధాబాల యజమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ, ధాబాలలో అక్రమంగా మద్యం విక్రయించినా లేదా మద్యం సేవించడానికి అనుమతించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధాబాల వద్ద అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా యజమానులే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.



**ప్రధాన సూచనలు & ఆదేశాలు:**

మద్యం నిషేధం: ధాబాలలో ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం అమ్మకాలు జరపరాదు, మద్యం సేవించేందుకు వినియోగదారులను అనుమతించకూడదు. ట్రాఫిక్ నియంత్రణ: ధాబాల ముందు రోడ్లపై లారీలు, ఇతర వాహనాలను అస్తవ్యస్తంగా నిలపడం వల్ల తీవ్రమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో పాటు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. కావున వాహనాలను నిర్దేశిత పార్కింగ్ స్థలాల్లోనే నిలిపేలా యజమానులు చర్యలు తీసుకోవాలి. శాంతిభద్రతల పరిరక్షణ: ధాబాల వద్ద ఎలాంటి గొడవలు జరగకుండా చూడాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సంబంధిత యజమానులపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సిసి కెమెరాల ఏర్పాటు: భద్రతా కారణాల దృష్ట్యా ప్రతి ధాబా వద్ద తప్పనిసరిగా సిసి టివి (జిఋఋ) కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా ఈ తనిఖీలు, సమావేశాలు నిర్వహిస్తున్నామని, నిబంధనలు అతిక్రమిస్తే ధాబాలను సీజ్ చేయడానికి కూడా వెనుకాడమని పోలీసులు స్పష్టం చేశారు.

# భూమి ఛానెల్ లో ఆక్రమణలు తొలగించాలి



**పాయకరావుపేట , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** వేలాది ఎకరాల రైతుల పంట పొలాలకు సాగునీరు అందించే భూమి ఛానల్ పొడవునా ఆక్రమణలకు గురవడంతో ఛానెల్ ద్వారా వచ్చే సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో జనసేన పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ ఇంచార్జి, అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబరు గెడ్డం బుజ్జి తన సొంత నిధులతో పిఎల్ పురం మధుము నుంచి ఉద్దండపురం వరకూ పూడికతీత పనులు చేయించారు. అయితే ఐదు లక్షలు గ్రాంటు మంజూరు అయింది. మంజూరైన నిధులతో పుడికతీత పనులు చేపడుతుండగా మొత్తం అంతా కాలవ పరిధి ఆక్రమణలకు గురైంది. 2.20 మిషన్ కాలువ దిగి మురగడ త్రవ్వకాలు చేపడుతూ ఉండడంతో ఆక్రమణల వల్ల సాధ్యం కావడం లేదు. పోలీస్ స్టేషన్ వద్ద నుంచి కనోసా స్కూల్ వరకూ త్రవ్వకాలు జరుగుతున్నాయి. ఇక్కడ రోడ్డు దాటాలంటే ట్రాలీ పెట్టి దాటాలి. ఇటు దాటాలంటే పదివేలు రూపాయలు ఖర్చు అవుతుందని అలాగే షుగర్ ఫ్యాక్టరీ దగ్గర నుంచి అటు దాటాలంటే మరో పది వేలు రూపాయలు ఖర్చు అవుతుంది అని అయితే మట్టి తీసేందుకు మిషన్లుకు త్రోవ లేకుండా ఆక్రమణలు ఉండడంతో త్రవ్వకాలు జరిగే పరిస్థితి కనపడలేదు. అయితే రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి రైతులకు భూమి చానల్ ద్వారా సక్రమంగా సాగునీరు అందించాలని గెడ్డం బుజ్జి రెవిన్యూ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భూమి ఛానల్ చైర్మన్ గెడ్డం చైతన్య, జనసేన పార్టీ విశాఖ జిల్లా సంయుక్త కార్యదర్శి పల్లి దుర్గారావు పాల్గొన్నారు.

## 13 నుండి ఐశ్వర్య లక్ష్మీ అమ్మవారి శ్రావణ మాసోత్సవాలు



**భీమునిపట్నం , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** భీమిలి శ్రీ ఐశ్వర్య వేంకటేశ్వర స్వామివారి దివ్య క్షేత్రంలో కొలువై ఉన్నటువంటి శ్రీ ఐశ్వర్య లక్ష్మీ అమ్మవారి శ్రావణ మాసోత్సవాలు ఈ నెల 13 వతేది గురువారం నుండి సెప్టెంబర్ 11 వరకు వైభవం గా నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టిస్ తెలియచేసారు. ఈ సందర్భంగా శనివారం ఆలయ ప్రాంగణం లో శ్రావణ మాసోత్సవాల గోడపత్రికను ఆలయ ట్రస్టిస్ కలిగొట్ల శ్రీరామ చంద్రమూర్తి, కలిగొట్ల సూర్య నారాయణ మూర్తి, కలిగొట్ల భానోజిరావు, కలిగొట్ల శ్రీనివాసరావు, తాతాజీ ల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ శ్రావణ మాసం లో నెల రోజులు అమ్మవారికి జరుగు కుంకుమ పూజలో భక్తులు పాల్గొని, శ్రీ ఐశ్వర్య లక్ష్మీ అమ్మవారి ఆశీస్సులు పొందగలరని ఆలయ ట్రస్టీస్ తెలియ జేశారు.

## శ్రీ ప్రకాష్ లో హోరాహోరీగా సాగుతున్న సిబిఎస్ఇ సౌత్ జోన్-1 హ్యాండ్ బాల్ పోటీలు



**పాయకరావుపేట , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** శ్రీ ప్రకాష్ లో సిబిఎస్ఇ సౌత్ జోన్ – 1 హ్యాండ్ బాల్ పోటీలు రెండో రోజుకు చేరుకోగా వివిధ విభాగాల్లో పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన సీబీఎస్ఈ పాఠశాలల క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శిస్తూ విజయమే లక్ష్యంగా తలపడుతున్నారు. సుమారు మూడు రాష్ట్రాల నుండి 2500 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీలు ఆద్యంతం ఎంతో ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ... ఈ పోటీల ఫైనల్స్ 10 వ తేదీన జరుగుతాయని, ఫైనల్స్ కు చేరుకోవడానికి ప్రతీ జట్టు ఎంతో శ్రమిస్తుందని, ప్రతి మ్యాచ్ ప్రాధాన్యత సంతరించుకుందని, విజయం సాధించి తదుపరి దశకు అర్హత సాధించేందుకు జట్లు అత్యంత వ్యూహాత్మకంగా, పట్టుదలతో పోరాడుతున్నాయన్నారు. దీంతో పోటీలు మరింత ఆసక్తికరంగా మారాయన్నారు. ప్రతి మ్యాచ్‌లోనూ క్రీడాకారులు ఉత్సాహం, క్రమశిక్షణ, జట్టు సమన్వయం, పోటీతత్వాన్ని ప్రదర్శిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపల్ ఎంవివిఎస్ మూర్తి, ప్రిన్సిపల్ రవి, సిబిఎస్ఇ పర్యవేక్షకులు స్వామి, వివిధ రాష్ట్రాలనుండి వచ్చిన క్రీడాకారులు, కోచ్లు, మేనేజర్లు పాల్గొన్నారు.

# గిరిజనుల అభివృద్ధి, సంస్కృతికి అద్దం పట్టేలా ప్రదర్శన స్టాళ్లు

**- గిరిజన సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను పరిశీలించిన రాష్ట్ర వ్యవసాయ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**- గిరిజన సంప్రదాయాలు, జీవన విధానం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేలా ఏర్పాట్లు**



**పార్వతీపురం , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానంతో పాటు వారి అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పార్వతీపురంలో ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ శాఖల ప్రదర్శన స్టాళ్లను రాష్ట్ర వ్యవసాయ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర మహిళా, శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో కలిసి ప్రత్యేకంగా సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు వివిధ శాఖల స్టాళ్లను ఆసక్తిగా పరిశీలించి, గిరిజన ప్రాంతాల్లో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గిరిజనుల ఆర్థిక, సామాజిక అభివృద్ధితో పాటు వ్యవసాయం, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య, వైద్య ఆరోగ్య రంగాల్లో ప్రభుత్వం అందిస్తున్న సేవలు, సౌకర్యాలను పరిశీలించారు.

### గిరిజన సంస్కృతి ప్రత్యేక ఆకర్షణ

గిరిజనుల సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, జీవన విధానం, వారు వినియోగించే సంప్రదాయ వస్తువులతో ఏర్పాటు చేసిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఐటిడిఏ పరిధిలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన ఛాయాచిత్ర ప్రదర్శనను మంత్రులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఐటిడిఏ చేపడుతున్న కార్యక్రమాల వివరాలను డిఐపిఆర్ఓ కెబిఎం సింగ్, డీపీఆర్ఓ ఐ. శ్రీనివాసరావు, డివిజనల్ పిఆర్ఓ జి.వి. రవికుమార్ మంత్రులకు వివరించారు. ఐటిడిఏ ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌తో పాటు గిరిజన సంక్షేమ శాఖ, వీబీ జీ రామ్ జీ, వాటర్‌షెడ్ 2.0, వైద్య ఆరోగ్య, మత్స్య, పశుసంవర్ధక, ఉద్యానవన, వ్యవసాయ, సూక్ష్మ నీటిపారుదల, డీఆర్డీఏ, జీసీసీ తదితర శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి అచ్చెన్నాయుడు పరిశీలించారు.

### ఉచిత న్యాయ సేవలపై అవగాహన

న్యాయ శాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌ను కూడా మంత్రులు సందర్శించారు. మండల న్యాయ సేవాధికార సంస్థల ద్వారా ప్రజలకు అందుతున్న ఉచిత న్యాయ సేవలు, న్యాయ సహాయం, ప్రజలకు అందుబాటులో ఉన్న సేవల గురించి అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు గాదె శ్రీనివాసులు నాయుడు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ, జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి, ఎస్పీ ఎస్.వి. మాధవ్ రెడ్డి, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# "జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ"

**విశాఖపట్నం , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ):** ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మరియు మేనేజ్‌మెంట్ విద్య పితామహుడు, "ఆచార్యులకే ఆచార్యుడు"గా పేరుగాంచిన దివంగత ప్రొఫెసర్ కె. వి. శివయ్య శత జయంతి సందర్భంగా, డిసిఎంస్ విభాగం మరియు ాఖ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ సంయుక్తంగా 2026 సెప్టెంబర్ 3 మరియు 4 తేదీలలో ఏయూ లో జాతీయ సదస్సును నిర్వహిస్తున్నాయి. "వికసిత్ భారత్ ఏ2047 దిశగా కామర్స్ మరియు మేనేజ్‌మెంట్ విద్య పునర్నిర్మాణం"లి అనే అంశంపై ఈ జాతీయ సదస్సు జరుగుతుంది. ప్రొఫెసర్ కె. వి. శివయ్య ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అనేక కీలక బాధ్యతలను నిర్వహించడంతో పాటు దక్షిణ భారతదేశమంతటా కామర్స్ విద్య విస్తరణకు విశేష కృషి చేశారు.సదస్సు వివరాలతో కూడిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ తన కార్యాలయంలో విడుదల చేసారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య జలాది రవి, విభాగాధిపతి ఆచార్య ఉమాదేవి, ఆచార్య బి.మోహన వెంకట రామ్, ఆచార్య అరుణ్



కుమార్ తదితరులు పాల్గొన్నారు. సదస్సుకు సంబంధించిన థీంపై ఒరిజినల్ పరిశోధనా పత్రాలను ఆహ్వానిస్తున్నారు. ఆసక్తి ఉన్నవారు తమ పరిశోధనా పత్రాలను ప్రిన్సిపాల్, ఏయూ ఆర్ట్స్ కామర్స్ కాలేజ్ మరియు,విభాగాధిపతి, DCMS, AU కి ఆగస్టు 20వ తేదీలోగా పంపాలి. ఈ సదస్సు యొక్క ప్రధాన ఇతివృత్తం ఆవిష్కరణలు , సుస్థిరత , ఉపాధి అవకాశాలు , డిజిటల్ పరివర్తన మరియు గ్లోబల్ పోటీతత్వం అంశాలపై కేంద్రీకృతమై ఉంటుంది. ఎంతో ప్రాధాన్యత ఉన్న ఈ జాతీయ సదస్సులో పలువురు విద్యావేత్తలు, పరిశోధకులు, విధాన రూపకర్తలు మరియు పరిశ్రమల ప్రతినిధులు పాల్గొంటారు. వివిధ రంగాలలో స్థిరపడిన ఐజమీా పూర్వ విద్యార్థులు కూడా ఈ సదస్సుకు హాజరవుతారు. ఒక ప్లీనరీ సెషన్ మరియు నాలుగు టెక్నికల్ సెషన్లు నిర్వహించడానికి ప్రణాళిక రూపొందించారు.

# గీతం ఆసుపత్రిలో జీవన్‌దాన్ ద్వారా మూత్రపిండాల మార్పిడి

**భీమునిపట్నం , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** గీతం విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) కు చెందిన గీతం ఆసుపత్రి, జీవించి ఉన్న మరియు మరణించిన (మస్తిష్క మరణం పొందిన) దాతల నుండి మూత్రపిండాల మార్పిడి (కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్) శస్త్రచికిత్సలను నిర్వహించడానికి జీవన్‌దాన్ సంస్థ నుండి అధికారిక అనుమతి పొందిందని ఆసుపత్రి పరిపాలన అధికారి డాక్టర్ బి.కార్తీక్ తెలిపారు. జీవన్‌దాన్ కార్యక్రమం క్రింద ట్రాన్స్‌ప్లాంట్ ప్రోగ్రామ్‌కు నెఫ్రాలజీ, యురాలజీ మరియు ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీ, అనస్థీషియాలజీ, క్రిటికల్ కేర్, రేడియాలజీ మరియు లేబొరేటరీ మెడిసిన్ వంటి వివిధ విభాగాలకు చెందిన సీనియర్ వైద్య నిపుణులు మరియు ప్రత్యేక శిక్షణ పొందిన ఆరోగ్య సంరక్షణ సిబ్బంది నేతృత్వం వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కిడ్నీ మార్పిడి సేవలు తగిన వైద్య మూల్యాంకనం, చట్టబద్ధమైన నిబంధనలకు కట్టుబడి ఉండటం, జీవన్‌దాన్ విధానాలు మరియు ప్రభుత్వ అవయవ మార్పిడి చట్టాలకు లోబడి అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. జీవన్‌దాన్ అమలుకు గీతం ఆసుపత్రిలో దాత మరియు స్వీకర్త ఇద్దరికీ ప్రత్యేకంగా రూపొందించిన అత్యాధునిక శస్త్రచికిత్స థియేటర్లు మరియు ఆధునిక సదుపాయాలతో కూడిన ప్రత్యేక కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ విభాగాన్ని సమగ్రంగా అందుబాటులోకి తెచ్చామని ఆయన పేర్కొన్నారు. 73 ఐసియు బెడ్లతో కూడిన 750 పడకలు గల గీతం బోధన ఆసుపత్రి అత్యుత్తమ అవస్థాపన సదుపాయాలు మరియు అనుభవజ్ఞులైన నిపుణుల బృందంతో



విస్తృత స్థాయి వైద్య, శస్త్రచికిత్స మరియు సూపర్ స్పెషాలిటీ సేవలను అందిస్తోందని ఆయన వెల్లడించారు.

గీతం ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, కార్డియాలజీ, కార్డియోథొరాసిక్ మరియు వాస్కులర్ సర్జరీ (సిటివిఎస్), న్యూరాలజీ, న్యూరోసర్జరీ, నెఫ్రాలజీ, ఎండోక్రైనాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, యురాలజీ, సర్జికల్ ఆంకాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, ప్రసూతి మరియు స్త్రీ వైద్య విభాగం, పల్మోనాలజీ, ఈఎన్టీ, ఆప్తాల్మాలజీ, డెర్మటాలజీ, సైకియాట్రీ, ఎమర్జెన్సీ మెడిసిన్, క్రిటికల్ కేర్, రేడియాలజీ, ఇంటర్వెన్షనల్ రేడియాలజీ మరియు అనస్థీషియాలజీ వంటి అనేక ప్రత్యేక విభాగాలు ప్రజలకు సేవలు అందిస్తున్నాయని ఆయన తెలిపారు.

# ములకలపల్లి పిఏసిఎస్ నూతన బృందానికి శాలువాతో సన్మానం

**దేవరాపల్లి , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** మండలంలో గల ములకలపల్లి గ్రామంలో ఉన్న ములకలపల్లి పిఏసిఎస్ కు కొత్తగా ఎన్నికైన అధ్యక్ష, డైరెక్టర్లను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శాలువాతో ఘనంగా సన్మానించారు. పిఏసిఎస్ నూతన అధ్యక్షుడిగా రెడ్డి పైడం నాయుడు, డైరెక్టర్‌గా చామంతుల బాలు బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో శనివారం గ్రామంలోని పిఏసిఎస్ కార్యాలయంలో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, పిఏసిఎస్ వ్యవస్థ బలోపేతం కావాలంటే నూతన కమిటీ పారదర్శకంగా పని చేయాలని కోరారు. రైతులకు సకాలంలో రుణాలు, ఎరువులు, విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు."ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. రైతు భరోసా, పంటల బీమా, ఉచిత విద్యుత్ వంటి పథకాలు ప్రతి రైతుకు అందేలా పిఏసిఎస్ కీలక పాత్ర పోషించాలి. రైవాడ ప్రాజెక్టు ఆయకట్టు కింద ఉన్న రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూస్తాం" అని అన్నారు. ఈ



కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, మండల పార్టీ అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, రైవాడ జలాశయం చైర్మన్ పోతల పాత్రునాయుడు పాల్గొన్నారు. అలాగే స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన పదాధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.నూతన అధ్యక్షుడు పైడం నాయుడు మాట్లాడుతూ, ఎమ్మెల్యే ఆశీస్సులతో పిఏసిఎస్ ను రైతులకు మరింత ఉపయోగకరంగా తీర్చిదిద్దుతామని అన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా, అందరికీ సమానంగా సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమం చివరలో నూతన కమిటీ సభ్యులను పూలదండలతో సత్కరించారు.

# శశి కళాశాల గుర్తింపు రద్దు చేయాలి..పలు ప్రజా సంఘాల డిమాండ్





**ఆనందపురం , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** ఆనందపురం మండలం బోయపాలెం వద్ద ఉన్న శశి కళాశాల హాస్టల్‌లో విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే కళాశాల గుర్తింపును రద్దు చేయాలని పలు ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, పారిశుద్ధ్య పరిస్థితులు, ఆహార నాణ్యత తదితర అంశాలపై అధికారులు విచారణ చేపట్టిన నేపథ్యంలో ప్రజా సంఘాలు స్పందించాయి. విద్యార్థుల భద్రత, ఆరోగ్యంతో ముడిపడిన అంశాల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. ఇప్పటికే భీమిలి ఆర్డీవో సంగీత్ మాదర్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో అధికారుల బృందం హాస్టల్‌ను పరిశీలించి వివరాలు సేకరించిన విషయాన్ని వారు ప్రస్తావించారు. ఆహార పదార్థాలకు సంబంధించిన నమూనాలను పరిశీలించి, వాటి ఫలితాల ఆధారంగా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల వసతులు, హాస్టల్ నిర్వహణ, పారిశుద్ధ్యంపై అధికారులు సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించాలని, నివేదికలో నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే సంబంధిత సంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. విద్యార్థుల భద్రతకు భంగం కలిగించే పరిస్థితులు పునరావృతం కాకుండా పర్యవేక్షణ వ్యవస్థను పటిష్ఠం చేయాలని కోరారు.

## ఒడిశా ఫుడ్‌ప్రో - 2026 ఇన్వెస్ట్‌మెంట్ అవుట్‌రీచ్ కార్యక్రమంలో పాల్గొన్న అనకాపల్లి ఎంపీ





**న్యూఢిల్లీ , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** న్యూఢిల్లీ వేదికగా ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ అధ్యక్షతన నిర్వహించిన "ఒడిశా ఫుడ్‌ప్రో--2026 ఇన్వెస్ట్‌మెంట్ అవుట్‌రీచ్" కార్యక్రమంలో రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం. రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ రిని ఎంపీ సోదరులు సీఎం రాజేష్ తో కలసి మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. దేశంలోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగ నిపుణులతో సమావేశమై భారతదేశంలో ఆహార ప్రాసెసింగ్ రంగ అభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహం, విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తుల విస్తరణ, ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

## బిజెపి మండలం పార్టీ నూతన అధ్యక్షుడిగా సాంబశివరావు నియామకం

రోలుగుంట మండల నూతన అధ్యక్షుడిగా వడ్డిపకు గ్రామానికి చెందిన గజ్జి సాంబశివరావు నియమితులయ్యారు



**రోలుగుంట , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** జిల్లా అధ్యక్షులు పరమేశ్వరరావు ఆదేశాలతో శుక్రవారం రోలుగుంటలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా మామిడి రమణ, చిటికెల వెంకట రమణ, కోశాధికారిగా గొల్లు తమ్మునాయుడు, ఉపాధ్యక్షులుగా అట్టా లోవ, చావ్వాకుల భాస్కరరావు,సియ్యాద్రి కవితా రాణి, లాగుడు గణేష్, ముక్కుడుపల్లి జగదీశ్, బొబ్బిలి సాంబమూర్తి, సహా కార్యదర్శులుగా శీలంరెడ్డి భార్గవి ల్, చందక రామకృష్ణ, మద్దు నారాయణరావు, మీలాసు కృష్ణ, కిముదు ప్రసాద్, పడాల రమణలను నియమించారు.

ఈ సందర్భంగా నూతన కమిటీని పలువురు అభినందించారు.

## విలువలు, దేశసేవే విద్యకు

# మార్గదర్శకాలు కావాలి : వెంకయ్యనాయుడు




**విశాఖపట్నం , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** విద్యను ఒక లక్ష్యంగా, విలువలతో కూడిన సేవా మార్గంగా చూడాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. విద్యార్థులు తమ విద్యా పరిజ్ఞానానికి సంస్కారం, విలువలు, నైతికత, క్రమశిక్షణ, తమ సంస్కృతిపై గౌరవాన్ని జోడించుకోవాలని సూచించారు. విదేశాలకు వెళ్లి విద్యను అభ్యసించి, సంపాదించవచ్చని.. అయితే మాతృభూమికి తిరిగి వచ్చి దేశసేవ చేయాలని అన్నారు. ఆత్మవిశ్వాసం, సంకల్పం, కష్టపడి పనిచేసే తత్వంతో ఎలాంటి సవాళ్లనైనా అధిగమించి సమాజానికి, దేశానికి అర్థవంతమైన సేవ చేయగలరని పేర్కొన్నారు. అమరావతిలోని అమృత విశ్వవిద్యాపీఠం రెండో స్నాతకోత్సవానికి వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ విద్య, సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, రియల్‌టైమ్ గవర్నెన్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అతిథి గౌరవంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొత్తం 319 మంది విద్యార్థులు పట్టాలు అందుకున్నారు. వీరిలో 280 మంది బీటెక్, 39 మంది ఎంబీఏ విద్యార్థులు ఉన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు, విద్యా పతకాలు, ధ్రువపత్రాలను అందజేశారు. విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, ఆహ్వానిత అతిథులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

### విద్యతో పాటు బాధ్యత

పట్టాలు అందుకున్న విద్యార్థులను ఉద్దేశించి మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. స్నాతకోత్సవం విద్యకు ముగింపు కాదని, కుటుంబం, సమాజం, దేశం పట్ల మరింత పెద్ద బాధ్యతకు ఇది ఆరంభమని అన్నారు. అమృత విశ్వవిద్యాపీఠం విద్యార్థులకు ఆలోచించడం, నాయకత్వం వహించడం మాత్రమే కాకుండా.. కరుణ, నిజాయతీతో సేవ చేయడం కూడా నేర్పుతోందని చెప్పారు.

విద్యార్థులు ఉద్యోగం ఎక్కడ లభిస్తుందనే దానికంటే.. తాము ఏ సమస్యను పరిష్కరించగలమనే దానిపై దృష్టి పెట్టాలని సూచించారు. నూతన ఆవిష్కర్తలు, వ్యాపారవేత్తలు, ఉద్యోగాలను సృష్టించే వారిగా ఎదగాలని ఆకాంక్షించారు. వైఫల్యాన్ని 'నేర్చుకోవడంలో తొలి ప్రయత్నం'గా భావించాలని సూచిస్తూ.. నిజాయతీ, వినయం, పట్టుదలతో అత్యుత్తమ ప్రతిభను సాధించాలని పిలుపునిచ్చారు.

### కరుణతో జ్ఞానాన్ని వినియోగించాలి

అమృత విశ్వవిద్యాపీఠం కులపతి సద్గురు శ్రీమాత అమృతానందమయి దేవి 'అమ్మ' రికార్డు చేసిన సందేశంలో పట్టభద్రులను ఉద్దేశించి మాట్లాడారు. సమాజం పట్ల బాధ్యత, కరుణతో తమ జ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు.

"మీ అవసరాల గురించి మాత్రమే ఆలోచించకుండా.. ప్రపంచాన్ని మెరుగుపర్చేందుకు మీరు ఏం చేయగలరో కూడా ఆలోచించాలి. మీ జీవితం ప్రపంచ సేవకు కూడా అంకితం కావాలి. ప్రేమ అనే నూనెలో తడిసిన కరుణ అనే వత్తిని వెలిగించాలి" అని అమ్మ సందేశంలో పేర్కొన్నారు.

### విద్య, నియామకాలు, పరిశోధనల్లో పురోగతి

అమరావతి ప్రాంగణం విద్య, ఉద్యోగ నియామకాలు, పరిశోధన రంగాల్లో సాధించిన పురోగతిని రెండో స్నాతకోత్సవం సందర్భంగా వివరించారు. ఇంజినీరింగ్ విద్యార్థుల నియామకాల్లో ఇప్పటివరకు అత్యధిక వార్షిక వేతన ప్యాకేజీ రూ.48 లక్షలు కాగా.. సగటు ప్యాకేజీ రూ.6.8 లక్షలుగా నమోదైంది. అమెజాన్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, డెలాయిట్, కాగ్నిజెంట్ తదితర సంస్థలు సహా 350కుపైగా సంస్థలు నియామకాల్లో పాల్గొన్నాయి. ఎంబీఏ విద్యార్థుల నియామకాల్లో అత్యధిక వార్షిక వేతన ప్యాకేజీ రూ.12 లక్షలు కాగా.. సగటు ప్యాకేజీ రూ.7.2 లక్షలుగా ఉంది. ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ తదితర సంస్థలు సహా 22కుపైగా సంస్థలు నియామకాల్లో పాల్గొన్నాయి. ప్రాంగణంలో విద్యార్థుల పరిశోధనలకు సంబంధించి 150 పరిశోధనా ప్రచురణలు, అధ్యాపకుల నుంచి 652 పరిశోధనా ప్రచురణలు వెలువడ్డాయి. 10 పేటెంట్లు నమోదయ్యాయి. బాహ్య సంస్థల నుంచి నిధులు పొందిన అధ్యాపకుల పరిశోధనా ప్రాజెక్టులు కూడా సంస్థ అభివృద్ధికి దోహదపడ్డాయి. ఈ కాలంలో ఇంటర్న్‌షిప్‌లలో విద్యార్థులు 1.6 శాతం మేర అత్యుత్తమ పనితీరు, విజయాలను సాధించినట్లు విశ్వవిద్యాలయం తెలిపింది. పట్టాలు అందుకున్న విద్యార్థులు ఇక తమ వృత్తిపరమైన ప్రయాణాన్ని ప్రారంభించనున్నారు. విద్యా నైపుణ్యం, నూతన ఆవిష్కరణలు, సామాజిక బాధ్యత, దేశ నిర్మాణం వంటి విశ్వవిద్యాలయ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లాలని వర్సిటీ ఆకాంక్షించింది.

### అమృత విశ్వవిద్యాపీఠం గురించి

అమృత విశ్వవిద్యాపీఠం ప్రముఖ బహుళశాఖల పరిశోధన ఆధారిత ప్రైవేటు విశ్వవిద్యాలయం. జాతీయ అంచనా, గుర్తింపు మండలి నుంచి అత్యున్నత ఏ౦౦ గ్రేడ్ గుర్తింపు పొందింది. ప్రపంచవ్యాప్తంగా పేరొందిన మానవతావాది శ్రీమాత అమృతానందమయి దేవి 'అమ్మ' స్థాపించిన ఈ విశ్వవిద్యాలయం 'జీవితానికి విద్య', 'కరుణ ఆధారిత పరిశోధన' అనే ప్రత్యేక లక్ష్యాలతో పనిచేస్తోంది.

అమరావతి, అమృతపురి, బెంగళూరు, చెన్నై, కోయంబత్తూరు, ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంతం (ఫరీదాబాద్), హరిద్వార్, కొచ్చి, మైసూరు, నాగర్‌కోయిల్‌లోని 10 ప్రాంగణాల్లో విశ్వవిద్యాలయం కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 19 అనుబంధ పాఠశాలల ద్వారా 2,000 మందికిపైగా అధ్యాపకుల మార్గదర్శకత్వంలో 30,000 మందికిపైగా విద్యార్థులకు విద్య అందిస్తోంది. ఇంజినీరింగ్, వైద్యం, నిర్వహణ, కంప్యూటింగ్, శాస్త్రాలు, కళలు, మానవీయ శాస్త్రాలు తదితర విభాగాల్లో 300కుపైగా పట్టభద్ర, పీజీ, డాక్టరేట్ కోర్సులను అందిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ విశ్వవిద్యాలయాలతో 180కుపైగా అంతర్జాతీయ భాగస్వామ్యాలను అమృత విశ్వవిద్యాపీఠం ఏర్పాటు చేసుకుంది. జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ చట్రం--2025 విశ్వవిద్యాలయాల విభాగంలో 8వ ర్యాంకు, వైద్య విభాగంలో 9వ ర్యాంకు సాధించింది. సామాజిక, సుస్థిర అభివృద్ధికి చేస్తున్న కృషికి గుర్తింపుగా 2026 టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ సస్టెయినబిలిటీ ఇంపాక్ట్ ర్యాంకింగ్స్‌లో ప్రపంచంలోని 40 అత్యుత్తమ సంస్థల్లో స్థానం సంపాదించింది.



# చెట్లు నరికివేత... రైతుల ఆందోళన



**పద్మనాభం , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ):** పద్మనాభం మండలం కృష్ణాపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 1లో తమ సాగు భూముల్లో చెట్లను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా నరికివేశారంటూ సుమారు 50 మంది ఎస్సీ, బీసీ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సూరాల సన్యాసినాయుడు ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. రైతుల వివరాల ప్రకారం.. జూలై 13న కొందరు ప్రైవేటు వ్యక్తులు, అధికారుల సహకారంతో యంత్రాలతో వచ్చి తమ భూముల్లోని టేకు, నీలగిరి, జీడి, మామిడి తదితర చెట్లను నరికివేసి భూమిని చదును చేశారని ఆరోపించారు. దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములను ప్రైవేటు సౌర విద్యుత్ సంస్థకు, విత్తనాల సంస్థ గోదాముల నిర్మాణానికి అప్పగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వారు పేర్కొన్నారు. తమకు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా భూముల్లో పనులు చేపట్టడం సరికాదని రైతులు తెలిపారు. చెట్లను నరికివేసి జరిగిన నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలని, రైతుల భూములకు రక్షణ కల్పించాలని కోరారు. భూములను ప్రైవేటు సంస్థలకు అప్పగించే చర్యలను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉంటే న్యాయం కోసం తాము ఇటీవల హైకోర్టును ఆశ్రయించామని రైతుల తరఫున భూములు యధాస్థితి కొనసాగించాలని స్టేటస్కో కూడా మంజూరు చేసిందని రైతులు పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని, లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని రైతులు పి. సూరిబాబు , ఎన్. ఆదయ్య, ఎన్. సన్యాసినాయుడు తదితరులు తెలిపారు.



# గంటా చొరవతో డిగ్రీ కళాశాలకు సొంత భవనం

**ఆనందపురం , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. ఇరుకైన గదులు, పరిమిత వసతులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు ఆనందపురంలో అన్ని హంగులతో నూతన భవనం అందుబాటులోకి రావడంతో వారి కల సాకారమైంది. భీమిలి నియోజకవర్గ శాసనసభ్యుడు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు చొరవతో కళాశాల నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయింపు జరగడంతో భవన నిర్మాణం సాకారమైందని వేములవలస మాజీ ఉపసర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ తెలిపారు. 2019లో మంజూరైన తగరపువలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల తొలుత కేవలం ఐదు గదుల తాత్కాలిక భవనంలో ప్రారంభమైంది. తగిన తరగతి గదులు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థినులకు వసతుల కొరత సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో కళాశాలకు శాశ్వత భవనం నిర్మించాలనే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి ఉన్నత సర్వ శిక్షా అభియాన్ పథకం కింద కళాశాల భవన నిర్మాణానికి



రూ.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అయితే భవన నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయింపు కీలకంగా మారింది. ఈ విషయాన్ని అప్పటి మంత్రి, ప్రస్తుత భీమిలి నియోజకవర్గ శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని ఆనందపురంలో కళాశాల నిర్మాణానికి ఐదు ఎకరాల స్థలం కేటాయించేలా కృషి చేశారని నవీన్ జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. నూతన భవనంలో విశాలమైన తరగతి గదులు, క్రీడా మైదానం తదితర సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక, ఇతర రంగాల్లో తమ ప్రతిభను మెరుగుపరుచుకునేందుకు మరిన్ని అవకాశాలు లభించాయని ఆయన అన్నారు. కళాశాలకు రవాణా సదుపాయాలు అందుబాటులో ఉండటంతో విద్యార్థులకు ప్రయాణ ఇబ్బందులు కూడా తగ్గాయని తెలిపారు. కళాశాలకు సొంత భవనం సమకూరడం వల్ల స్థానిక విద్యార్థులు ఉన్నత విద్యను తమ ప్రాంతంలోనే కొనసాగించే అవకాశం లభించిందని నవీన్ జ్ఞానేశ్వర్ అన్నారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఇది ఎంతో ప్రయోజనకరమన్నారు. కళాశాల సొంత భవనం కోసం ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల అభివృద్ధికి సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులకు విద్యార్థులు, తల్లిదండ్రుల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులోనూ కళాశాలలో మరిన్ని వసతులు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందేలా కృషి చేయాలని కోరారు.

# వైద్యులపై హింసను అరికట్టాలి

## ఒజీఎస్‌వీ ఆధ్వర్యంలో 'అభయ దినోత్సవం' అవగాహన ర్యాలీ

**విశాఖపట్నం , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** వైద్యులు, ఆరోగ్య సేవల సిబ్బందిపై హింసను అరికట్టి వారికి సురక్షితమైన పని వాతావరణం కల్పించాలని విశాఖపట్నం ప్రసూతి, స్త్రీరోగ వైద్యుల సంఘం (ఒజీఎస్‌వీ) పిలుపునిచ్చింది. 'అభయ దినోత్సవం' సందర్భంగా శనివారం ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రజా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ కార్యాలయం నుంచి ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ర్యాలీ గంటపాటు కొనసాగింది. వైద్యులు, ఆరోగ్య సేవల సిబ్బందిపై హింసకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్, అదనపు డీఎంఈ, ఒజీఎస్‌వీ అధ్యక్షురాలు డా. కె.వి.ఎస్.ఎం. సంధ్యాదేవి, కింగ్ జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్) సూపరింటెండెంట్ అతిథులుగా హాజరయ్యారు. ఆంధ్ర మెడికల్ కాలేజ్‌కు చెందిన అండర్




గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్థులతో పాటు వైద్యులు, ఆరోగ్య సేవల సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. వైద్యులు సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తించి, వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఒజీఎస్‌వీ కార్యదర్శి డా. జి. సునంద రాణి, పబ్లిక్ అవేర్‌నెస్ కమిటీ చైర్‌పర్సన్ డా. పి. సుధాపద్మశ్రీ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# విరిగిన హైమస్ట్ విద్యుత్ స్తంభం..వెంటనే హైమస్ట్ విద్యుత్ లైట్స్ ఏర్పాటు చేయాలని స్థానికులు వినతి

**విశాఖపట్నం , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** జీవీఎంసీ 45వ,వా,ర్డు కైలాసపురం, సూరిబాబు నగర్ కూడలి బస్ స్టాప్ సమీపంలో 162//25 నెంబర్ గల హైమస్ట్ విద్యుత్ స్తంభం తుప్పి పట్టి నెలకొరిగింది. ఈ సంఘటన జరిగి వారం రోజులు ఐనా సంబందిత జీవీఎంసీ అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ కారణంగా ఈ ప్రాంతం లో చీకటి ఆలమూకొందని స్థానికులు తెలియజేసారు. తక్షణం జీవీఎంసీ అధికారులు ఇక్కడ హైమస్ట్ విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి, హైమస్ట్ విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



## ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలి...!!



**ఆనందపురం , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని గాయత్రి గ్రామీణ ఆరోగ్య సేవల సంచాలకుడు, ప్రముఖ ఎముకల వైద్య నిపుణుడు డాక్టర్ అచ్యుతరామయ్య సూచించారు. ఆనందపురం మండలం వెంకటాపురంలో శనివారం ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో గాయత్రి వైద్య విజ్ఞాన పరిషత్ ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అచ్యుతరామయ్య మాట్లాడుతూ కీళ్ల నొప్పులు, ఎముకలు విరగడం, వెన్నెముక సమస్యలు తదితర ఎముకలకు సంబంధించిన వ్యాధులతో బాధపడుతున్న వారికి గాయత్రి ఆసుపత్రిలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు వ్యాధి ముదిరిన తర్వాత కాకుండా ముందుగానే వైద్యులను సంప్రదించి తగిన చికిత్స పొందాలని సూచించారు. శిబిరంలో సాధారణ వైద్య నిపుణుడు డాక్టర్ వై. శ్రావణ్, శస్త్రచికిత్స నిపుణురాలు డాక్టర్ హన్సిక, చిన్నపిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ ప్రియాంక, కంటి వైద్య నిపుణులు డాక్టర్ కీర్తన, డాక్టర్ బి. మౌనిక తదితరులు వైద్య సేవలు అందించారు. సుమారు 150 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి, జోనల్ సలహాదారు కోన ప్రకాష్, ఆనందపురం మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు రామకోటేశ్వరరావు, ప్రచార కార్యదర్శి వినోద్‌కుమార్, సభ్యులు గౌరీశంకర్, నారాయణస్వామి, వెంకటాపురం సామాజిక కార్యకర్త బొత్స డేవిడ్‌రాజు, గాయత్రి ఆసుపత్రి సమన్వయకర్త కిరణ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.


### శ్రీ కన్య థియేటర్లో నిలిచిపోయిన కొరియన్ కనకరాజు చిత్రం

**యాజమాన్యంపై మార్నింగ్ షో ప్రేక్షకుల ఆగ్రహం**

**విశాఖపట్నం , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** శ్రీ కన్య థియేటర్లో వరుణ్ తేజ్ నటించిన కొరియన్ కనకరాజు చిత్రం మార్నింగ్ షో లో సాంకేతిక లోపం కారణంగా సౌండ్ సిస్టం అర్ధాంతరంగా నిలిచిపోయింది. దీంతో 11:15 గంటలకు ప్రారంభం కావలసిన చిత్రం 11:30 కి వేశారు. కానీ ఎంతకి చిత్రం మొదలైన సౌండ్స్ రాకపోవడంతో ప్రేక్షకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యాజమాన్యానికి ప్రేక్షకులకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో మార్నింగ్ షో టికెట్ డబ్బులను వెనక్కి తిరిగి ఇచ్చేశారు. కానీ ఆన్లైన్లో బుక్ చేసుకున్న వారికి డబ్బులు రాకపోవడంతో యాజమాన్యంపై తిరగబడ్డారు. ఆన్లైన్లో మెసేజ్ పెట్టామని కొంతసేపటికి మనీ రిటర్న్ అవుతాదని ప్రేక్షకులకు నచ్చజెప్పి పంపారు.

# పాయకరావుపేటలో ఘనంగా తోట నగేష్ పుట్టినరోజు వేడుకలు

**పాయకరావుపేట , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** జనసేన పార్టీ సీనియర్ నాయకులు, ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ పుట్టిన రోజు వేడుకలు శనివారం ఆయన స్వగృహం వద్ద ఘనంగా నిర్వహించారు. పార్టీలకు అతీతంగా తెలుగుదేశం, వైసిపి, జనసేన, బిజెపి, సిపిఐ, సిపిఎం తదితర రాజకీయ పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పారిశ్రామిక వేత్తలు, డెక్కన్, హెటిరో కంపెనీల ఉద్యోగులు, వ్యాపారులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పలు స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో విచ్చేసి నగేష్ కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. భారీ బర్త్ డే కేక్ లు కట్ చేశారు. పూలమాలలు, బోకేలు, చిత్రపటాలు, మెమెంటోలు అందజేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువాలు, భారీ గజమాలలతో ఘనంగా సత్కరించారు. హిందూ, క్రైస్తవ, ముస్లిం మత పెద్దలు, పురోహితులు, పాస్టర్లు విచ్చేసి నగేష్ కు శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా తోట నగేష్ పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు వస్త్రాలు అందజేశారు. సమత సిడి ప్రోజెక్ట్ హాస్టల్ లో





చదువుతున్న విద్యార్థులకు ఒక నెలరోజుకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేసారు. టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను ఘనంగా సత్కరించి ప్రోత్సాహకాలు అందజేశారు. విద్యార్థినీ విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. సీనియర్ రాజకీయ నాయకులను ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. పట్టణంలోని చిత్రమందిర్ థియేటర్ సెంటర్ ఆటో యూనియన్ నాయకులు అన్న కేంటిన్ లో 700 మంది పేదలకు తమ సొంత నిధులతో ఉచితంగా భోజనాలు అందజేశారు. ఈ సందర్భంగా నగేష్ అభిమానులు పట్టణంలో పెద్ద సంఖ్యలో భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. పెద్ద ఎత్తున బాణా సంచా కాల్చి సందడి చేశారు. అతిథులు, నాయకులు, అధికారులు, ఉద్యోగులు, కార్యకర్తలు, అభిమానులు అందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. దీంతో నగేష్ ఇంటి వద్ద పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా తోట నగేష్ మాట్లాడుతూ... తనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

# సామాజిక సేవలతోనే దేశ ప్రగతి

**సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం కావాలి..అదరగొట్టిన మ్యూజికల్ మ్యాషప్**

**విశాఖపట్నం , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు అండగా నిలవడం, విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, పారిశుధ్యం వంటి అంశాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా దేశ ప్రగతికి బాటలు వేయవచ్చునని శక్తి ఎంపవరింగ్ వుమెన్ అసోసియేషన్. అధ్యక్షురాలు పైడి రజని అన్నారు.. శనివారం రాత్రి బీచ్ రోడ్ అంబికా సీ గ్రీన్ హోటల్ లో మ్యూజికల్ మ్యాషప్ ఈవినింగ్ . పేరిట సంగీతం నృత్యం.. వినోదం. తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత నిర్వాహకురాలు రజనీ మాట్లాడుతూ సామాజిక సేవ అనేది కేవలం ఆర్థిక సహాయం అందించడమే కాకుండా.. అవసరంలో ఉన్న వారికి సమయం, సహకారం, నైపుణ్యాన్ని అందించడమని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటే



సమాజంలో సానుకూల మార్పు తీసుకురావచ్చన్నారు. గడచిన ఏడేళ్లుగా తమ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. గౌరవ అతిథిగా హాజరైన జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి.. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు..డాక్ యార్డ్ కేటీబి అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ దేశ అభివృద్ధి ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రజల భాగస్వామ్యంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరిలో సేవా భావం పెంపొందినప్పుడే ఆరోగ్యకరమైన, సమానత్వంతో కూడిన సమాజం నిర్మాణమవుతుందని పేర్కొన్నారు. శక్తి ఎంపవరింగ్ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయం అన్నారు.. ఈ సందర్భంగా నిర్వహించిన మ్యూజికల్ మ్యాషప్ ఆవుతులను విశేషంగా అలరించింది.. పలువురు గాయకుల ఆలపించిన పాటలకు వీక్షకులు కూడా గొంతు కలిపి కేరింతలు కొట్టారు.. ఈ కార్యక్రమంలో నిర్వాహకురాలు భాగ్యలక్ష్మి.. ప్రముఖ గాయనీ గాయకులు దామోదర్.. అనూష సత్య.. కిరీటి.. నరేష్.. సంజయ్.. రామ్ వినయ్.. భువనేశ్వరి.. తిరుపతి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.. పెద్ద ఎత్తున యువత భాగస్వాములు అయ్యారు.

## శశి కళాశాల ఘటనపై ఆర్డిఓ విచారణ...!

**- విస్తుపోయే నిజాలు**

**- హాస్టల్ పరిసరాల్లో అపారశుభ్యం**



**ఆనందపురం , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** ఆనందపురం మండలంలోని బోయపాలెం వద్ద గల శశి కళాశాల హాస్టల్ లో జరిగిన పరిణామాలపై పలు దినపత్రికల్లో ప్రచరితం కావడంతో అధికారులు విచారణ ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆదేశాల మేరకు భీమిలి ఆర్డిఓ సంగీత్ మాదర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జగదీశ్వరరావు ఆధ్వర్యంలో అధికారుల బృందం శనివారం శశి కళాశాలకు వెళ్లి పూర్వపరాలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో ఉన్న విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేకపోవడం, హాస్టల్ ప్రాంగణంలో అపరిశుభ్రత వాతావరణం, ఆహార పదార్థాలలో నాణ్యత కొరవడం వంటి అంశాలపై సుదీర్ఘంగా శశి కళాశాల యాజమాన్యంతో మాట్లాడి నివేదిక తయారు చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు తీసుకున్న నమూనాల ఆధారంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆర్డీవో వెంట ఆనందపురం ఎమ్మార్వో శ్రీనుబాబు, స్థానిక పీహెచ్సీ వైద్యాధికారిణి షబీనా భాను ఉన్నారు. కొసమెరుపు ఏమిటంటే... అధికారులు విచారణకు వస్తున్న వార్త యాజమాన్యానికి తెలిసి అప్పటికప్పుడే యుద్ధ ప్రాతిపదికన హాస్టల్ ప్రాంగణంలో బ్లీచింగ్ పౌడర్ వంటి వ్యాధి నిరోధక పదార్థాలను చల్లించారు. హాస్టల్ రూమ్ లను అన్నింటిని చక్కదిద్దారు. ఇదే సంస్థ భీమిలి మండలం సంఘివలసలో నిర్వహిస్తున్న విద్యా సంస్థలపై కూడా అధికారుల బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. ఈ నివేదికను జిల్లా కలెక్టర్ కు పంపించనున్నట్లు ఆ బృందం పేర్కొంది.

## వార్డుల విభజనపై సింగిల్ జడ్జి

**అమరావతి , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** జీవీఎంసీ పరిధిలో వార్డుల పునర్విభజన ప్రక్రియను నిలుపుదల చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు ధర్మాసనం రద్దు చేసింది. వార్డుల పునర్విభజన కారణంగా పిటిషనర్ల చట్టబద్ధమైన హక్కులకు ఎలాంటి భంగం కలగడం లేదని గుర్తుచేసింది. కోర్టు ముందు ఉన్న రికార్డులను పరిశీలిస్తే ఈ ఏడాది మే 17న జారీచేసిన ప్రాథమిక నోటిఫికేషన్‌పై పిటిషనర్లు ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదని స్పష్టమవుతుందని పేర్కొంది. రాబోయే మూడు, నాలుగు వారాల్లో వార్డుల పునర్విభజనకు సంబంధించి తుది నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం లేదని, ఆగస్టు 11న సింగిల్ జడ్జి వద్ద రిట్ పిటిషన్లలో తుది వాదనలు వినిపిస్తామని ఏజీ చెబుతున్నారని గుర్తుచేసింది.

# విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ముగిసిన రిలే నిరాహార దీక్షలు

### కె. కె రాజు ఆధ్వర్యంలో మూడు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టిన విద్యార్థులు, యువత, నాయకులు

**విశాఖపట్నం , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** విద్యార్థి, నిరుద్యోగుల సమస్యలతో పాటు డీఎస్సీ అక్రమాలపై వైసీపీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు ఆధ్వర్యంలో సత్యం జంక్షన్ వద్ద ప్రారంభమైన రిలే నిరాహార దీక్షలు శనివారం మూడో రోజుకు చేరుకున్నాయి. శనివారం 47,48,49,50 51,52,53,54,55, వార్డు నాయకుల చేపట్టిన రిలే నిరాహార దీక్షలును కె. కె రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కే కే రాజు మాట్లాడుతు డీఎస్సీ అక్రమాలతో పాటు నిరుద్యోగ భృతి, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.9500 కోట్లు చెల్లించాలన్న డిమాండ్‌తో రాష్ట్ర వ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు చేస్తుంటే ప్రభుత్వం ఉలిక్కిపడుతోందని చెప్పారు. శాంతియుతంగా నిరసనలు తెలుపుతుంటే కొన్ని ప్రాంతాల్లో అధికార పార్టీ నేతలు దౌర్జన్యాలకు దిగుతున్నారని అన్నారు . ఈ ప్రభుత్వంలో ప్రశ్నించడమే నేరం అనే విధంగా అరెస్టులు, అక్రమ కేసులుపెడుతున్నారని, ఇలాంటి వాటికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ భయపడదు అని అన్నారు అధికార, పోలీస్ బలంతో తమ ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.అధికార పార్టీ నేతలు చెప్పినట్లు పోలీసులు నడుచుకోవద్దని కోరారు. అక్రమ అరెస్టులు, కేసులు పెడితే తిరుగుబాటు వస్తుందని హెచ్చరించారు. శనివారం నిరాహార దీక్ష చేపట్టిన అల్లుశంకర్ రావు, రేయ్యివెంకట రమణ, వావిలపల్లి ప్రసాద్ భర్కత్ ఆలీ, గుజ్జు వెంకట్ రెడ్డి, సు కుమార్,డోప్ప శ్రీను,ఐ.రవికుమార్, వేణు ధమయంతి,ఎరం శెట్టి శ్రీను,కె వి బాబా, షేక్ బాబ్జి, పి. ఈశ్వరి, చందు,కోరిబిల్లి చందు, తాటిపూడి రత్నం,సొండి సురేష్, శివరాం,విమల్ లకు నిమ్మరసం ఇచ్చి కె. కె. రాజు మూడవ రోజు దీక్ష విరమీశీప చేశారు. అనంతరం సత్యం జంక్షన్ వద్ద డి ఎస్ సి లో జరిగిన అక్రమాలు పై లోకేష్ రాజీనామా చేయాలనీ డిమాండ్ చేస్తు విద్యార్థులు, యువత,వైసీపీ శ్రేణులు తో కలిసి భారీగా మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగులు, విద్యార్థులు ,మేధావులు మరియు మాజీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, నియోజకవర్గ పరిశీలకులు ,బాణాల శ్రీనివాసరావు, పెడాడ రమణి కుమారి,ప్రచార విభాగం జోన్ -1 ప్రెసిడెంట్ రవిరాజు,మాజీ కార్పొరేటర్లు అనిల్ కుమార్ రాజు, పద్మరెడ్డి,కె వి ఎన్ శశికళ,పామెటీ బాబ్జి,వార్డు అధ్యక్షులు బొడేటి కిరణ్, రాష్ట్ర, జోనల్,జిల్లా,నియోజకవర్గ నాయకులు దేముడుబాబు మాస్టర్,కిరణ్ రాజు, తాడిజగన్నాధరెడ్డి,దువ్వలపూడి శ్రీనివాస్ అంబటి శైలేష్ యం.సునీల్, బయవరపు రాధా ,తిరుమలరావు, నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు,వార్డు పరిశీలకులు మరియు 47,48,49,50,51,53,54,55 వార్డుల సీనియర్ నాయకులు, జిల్లా నాయకులు,వార్డు వైస్ ప్రెసిడెంట్,మహిళలు, సచివాలయం అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు,మహిళలు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.




# మన్యం బంద్ పాక్షికంగా విజయవంతం

**- పోలీసులు అడుగడుగున అడ్డాంకాలు**

**- ప్రముఖ పర్యాటాక కేంద్రాలు ముసివేయడంతో పర్యాటకులకు తీవ్ర ఇబ్బందులు**

**అనంతగిరి , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** మండలంలో ఏజెన్సీ ముఖద్వారం చిలకలగడ్డ పంచాయతీ వెంకయ్యపాలెం రోడ్డు కూడలిలో శనివారం చేపట్టిన రాష్ట్ర ఆదివాసి గిరిజనుల బంద్ ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నము1.30 గం,, వరకు జరిగిన బంద్ కారణంగా పర్యాటకులు ఇతర వాహన చోదకులకు తీవ్ర ఆంతరయము కలిగి





రాకపోకలు స్తంభించాయి ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో ఉన్న పర్యాటక కేంద్రాలను సందర్శించడానికి వచ్చే వేలాదిమంది పర్యాటకులు మైదాన ప్రాంతం నుండి ప్రతి వీకెండ్స్ లో ప్రముఖ పర్యట కేంద్రమైన బొర్ర గుహలు కటికి జలపాతం గాలికొండ “యు”పాయింట్ కాఫీ ప్లాంట్ అందాల అరకు లోయలో ఉన్న అనేక పర్యాటక ప్రదేశాలను తిలకించి ఎంతో అనుభూతి ఆనందంతో గడిపి సేద తీర్చే పర్యాటక ప్రేమికులను రాకపోకలు తీవ్ర ఆంతరయం కలిగింది ముఖ్యంగా ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో పర్యాటక కేంద్రాలు దుకాణాలు హోటల్లు రెస్టారెంట్లు బార్లు మూత పడడం వలన వ్యాపార వ్యవస్థ ఆర్థికంగా నష్టం వాటిలిందని పలువురు వర్తక సంఘాలు ఆరోపించారు

## రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబు తోనే..ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో మాజీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం (జగన్)

**గాజువాక , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** గాజువాక నియోజకవర్గం 87వ వార్డు పరిధి ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం (జగన్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నేటితోనే సాధ్యమని ఇంటింటికి తెలుగుదేశం ప్రచారంలో కూటమి ప్రభుత్వం ఈ రెండేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు విజయరామరాజు, సెక్రటరీ బొట్టా ప్రకాష్,వై. భాస్కరావు, గెద్దాడ రాంబాబు, పోతల కృష్ణ, వై నాగేశ్వరరావు, దాలయ్య, మూర్తి, నాని తదితరులు పాల్గొన్నారు.



## సూపర్ స్టార్ మహేష్ బాబు సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



**విశాఖపట్నం , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** విశాఖ సిటీ వైడ్ కృష్ణ & మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు మద్ది రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సూపర్ స్టార్ మహేష్ బాబు ముందస్తు జన్మదిన వేడుకల్లో దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మహేష్ బాబు భారీ కటౌట్‌ను ప్రారంభించి, అనంతరం అభిమానులతో కలిసి కేక్ కట్ చేశారు. మహేష్ బాబు సినీ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకోవడంతో పాటు, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ఎంతోమందికి అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే కొనియాడారు. మహేష్ బాబు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. దీంతో కార్యక్రమ ప్రాంగణంలో భారీ పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో సంపంగి శ్రీను , స్టేట్ డైరెక్టర్ రూప , రాజేష్ , డాక్టర్ మఠ్రివేముల శ్రీనివాస్ , రమణ , గణేష్ , మహేష్ రెడ్డి , శ్రీధర్ ,స్థానిక నాయకులు, కూటమి శ్రేణులు, మహేష్ బాబు అభిమాన సంఘాల ప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## రూ.90 కోట్లతో లక్ష్మీదేవిపేట ఫ్లైఓవర్ పనులు

**అనకాపల్లి , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన లక్ష్మీదేవిపేట ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణ పనులను రైల్వేశాఖ ఆధ్వర్యంలో రూ.90 కోట్లతో చేపట్టనున్నట్లు అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తెలిపారు. దీనికి సంబంధించి పది రోజుల్లో టెండర్ల కూడా పిలవనున్నట్టు ఆయన చెప్పారు. శనివారం వంతెన నిర్మాణం జరిగే లక్ష్మీదేవిపేట, రైల్వేగేటు, భీమునిగుమ్మం జంక్షన్లను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ సీఎం రమేశ్ మీడియాతో మాట్లాడుతూ గతంలో రైల్వే పరంగా పనులు చాలా వరకు జరిగాయని, అయితే వంతెన నిర్మాణ పనులు నిలిచిపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన అభివృద్ధి పనులను కూడా రైల్వేశాఖ పరంగా పూర్తి చేస్తామన్నారు. ఇందుకోసం అధికారులతో ప్రత్యేక సమావేశం కూడా నిర్వహించామన్నారు. ఇప్పటికే పనులు ప్రారంభం కావాల్సి ఉందని, అయితే రైల్వే జోన్ హైదరాబాద్ నుంచి విశాఖకు రావడం వలన ఆలస్యమైందన్నారు. పనులు పునఃప్రారంభమైన 18 నెలల్లో పూర్తవుతాయన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ అనకాపల్లి పట్టణంలో ట్రాఫిక్‌ను తగ్గించేందుకు 20 ఏళ్ల క్రితం వంతెనకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డితో శంకుస్థాపన చేయించామన్నారు.

# సద్గురు శివానంద మూర్తి వారి అడుగు జాడల్లో అందరూ నడవాలి

### శివానంద కల్చరల్ సెంటర్ నిర్మాణ ప్రారంభోత్సవ సభలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

**విశాఖపట్నం , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** సద్గురు శ్రీ శివానంద మూర్తి వారి అడుగు జాడల్లో అందరూ నడవాలని బ్రహ్మ శ్రీ చాగంటి కోటేశ్వరరావు కోరారు. పూజ్య సద్గురు శ్రీ శివానంద మూర్తి శత జయంతి (1928 – 2028) ఉత్సవాల సందర్భంగా ప్రతిపాదిత "శివానంద కల్చరల్ సెంటర్" నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం సాయంత్రం వి ఎం ఆర్ డి ఎ ఎరీనా లో శనివారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా చాగంటి ప్రసంగిస్తూ సనాతన ధర్మ ప్రాముఖ్యతను చాటేందుకు సద్గురువులు సనాతన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేయడంవారిభవిష్యదర్శనమునకు నిదర్శన మన్నారు. అటువంటి కార్యక్రమానికి ఒక చిరునామా గా నిర్మాణం కాబోయే కల్చరల్ సెంటర్ నిలుస్తుందన్నారు. సనాతన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ , భీమిలి నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో విశిష్టతిథులుగా గురు విశ్వపతి, భీమిలి ఏం ఎల్ ఎ గంటా శ్రీనివాసరావు, గౌరవ అతిథులుగా రిటైర్డ్ ఐ ఎ ఎస్ అధికారి ఎల్ వి సుబ్రహ్మణ్యం, బి జె పి ఎం ఎల్ ఎ విష్ణు కుమార్ రాజు, ట్రస్ట్ డైరెక్టర్ ప్రో ఫెసర్ ఆర్.రాఘవేంద్రన్, కందుకూరి రాజ్, కే. రాజేశ్వరి,






వరంగల్ గురుధాం నుంచి గోపీచంద్ ప్రభృతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారుశివానంద కల్చరల్ సెంటర్ నిర్మాణం కు సంబంధించిన బ్రౌచర్ ను ఆవిష్కరించారు.

### ఆకట్టుకున్న శ్రీ మహాలక్ష్మీ వైభవం కచేరి


త్యాగరాజ స్వామి వైకుంఠ వర్ణన.. చూర్ణిక తో శుభారంభం మైన' శ్రీ మహాలక్ష్మీ వైభవం ' సాంస్కృతిక కచేరీ ఆద్యంతం శ్రోతలను ఆధ్యాత్మిక తరంగాలలో ఓలలాడించింది. వ్యాఖ్యాన సహిత కచేరీ శ్రీ మహాలక్ష్మీ తత్త్వాన్ని ఆవిష్కరించింది. వినయ్ ఎల్ వారణాసి కథకునిగా వ్యవహరించగా ,అర్చన, కుమారి సమన్విగాత్రానికి వీణ పై రక్షిత రమేష్, మృదంగంపై ఆదమ్య రామానంద్ సహకారం అందించారు.





**శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం నందు ప్రతి శనివారం నిర్వహించు తులసి దళర్చన నేడు నిర్వహించడమైనది. ఈ యొక్క సేవలో ఉభయధాతలు పాల్గొన్నారు : ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) విశాఖపట్నం**

# రిషికొండ శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న హోం మంత్రి అనిత









**విశాఖపట్నం , ఆగస్టు. 08 ( మనం న్యూస్ ) :** రిషికొండ శ్రీ వెంకటేశ్వర స్వామివారిని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న హోం మంత్రి అనితకు ఆలయ అధికారులు సంప్రదాయ ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు.

అనంతరం అంతరాలయంలో స్వామివారికి హోం మంత్రి అనిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు మంత్రికి వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను హోం మంత్రి అనితకు అందజేశారు.

ఈ సందర్భంగా ఆలయంలోని క్యూ లైన్‌లో ఉన్న భక్తులతో హోం మంత్రి అనిత ఆప్యాయంగా మాట్లాడారు. భక్తుల యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడంతో పాటు దర్శన ఏర్పాట్లపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

